ప్రతిమలు

వి. రతన్ ప్రసాద్

స్వర్గాన్ని మరపించే డార్జిలింగ్ పట్నం చేరుకున్నాడు చలం.. ఆ పట్నం సంతరించుకున్న అందచందాల్ని కరువు తీరా చూస్తూ ఉన్ననాటి మిత్రుడు శాంత మూర్తి బంగళాకు వెళ్ళాడు చలం...

దాదాపు పన్నెండేళ్ళ క్రితం, శాంత మూర్తీ చలం విజయవాడలోని ఒక పత్రికాఫీసులో ఒకరికొకరు పరిచయం అయ్యారు అప్పట్నుంచి విచిత్రంగానే వారి స్నేహం అల్లుకపోయింది వాళ్ళ

ద్దరూ ప్రాణమిత్రులే అయిపోయారు శాంతమూర్తి రచయిత...చలం ఆర్టిస్టు. శాంతమూర్తి రచనలకు చలం బొమ్మలు గీసే సందర్భాలు మరీ తరుచుగా వస్తూండేవి ...

వాళ్ళ స్నేహం వయస్సూ ఎనిమిదేళ్ళవుతున్న సమయంలో హఠాత్తుగా శాంతమూర్తి విజయవాడనుండి మాయమయ్యాడు అతని గురించిన వివరాలూ-అతని ఉనికి తెలియని చలం ఎంతగానో వ్యాకులపడ్డాడు...ఓ రెండు నెలల తరువాత శాంతమూర్తి దగ్గర్నుంచి, చలం ఉత్తరాన్ని అందుకున్నాడు.

"అనుకోని కారణాలవల్ల నీతో చెప్పకుండా ఇలా వచ్చేశాను. కారణాలు తర్వాత వివరంగా వ్రాస్తాను నీతో చెప్పకుండా ఇలా వచ్చేసినందుకు ఏమీ అనుకోవద్దు."-

అంతే!

ఆ మూడే వాక్యాలున్నాయి ఉత్తరంలో...అయితే అందులో శాంతమూర్తి తన 'అడ్రస్' ఇవ్వలేదు ఆ తర్వాత ఈ నాలుగేళ్ళలోనూ, అప్పుడూ అప్పుడూ ఉత్తరాలు ఎక్కడెక్కడి నుండో వస్తూనే వుండేవి అయితే ఆ ఉత్తరాల్లో విషయాలు చాలా క్లుప్తంగా వుండేవి ఏ ఒక్క ఉత్తరంలోనూ శాంతమూర్తి తన అడ్రసు రాయక పోవటం-చలానికి కొంత చిరాకుకూడా కలిగించింది.

సరిగ్గా వారంరోజుల క్రితం శాంతమూర్తి రాసిన ఎక్స్‌ప్రెస్ ఉత్తరాన్ని

చూసుకొని, అనుకోకుండా డార్జిలింగ్‌కు బయల్దేరి రావలసివచ్చింది ఇహ ఇక్క డ్నుంచీ కథ మీకు చలం చెప్తాడు...

* * *

నన్ను చూస్తూనే శాంతమూర్తి సంతో షంతో పొంగిపోయాడు. మనసారా నన్ను కౌగలించుకున్నాడు. అతనిమీద అంతకుముందు నాకున్న కోపమంతా ఆ కౌగిలిలో కరిగిపోయింది. ఆ మధ్యా హ్నం-భోజనం కాగానే, నా కోసం ప్రత్యేకంగా కేటాయించిన గదిలో నడుం వాల్చాను

నిద్ర పట్టటంలేదు. శాంతమూర్తిని గురించిన ఆలోచనలు నన్ను చుట్టు ముడుతున్నాయి స్నేహం విషయంలో శాంతమూర్తిలో అప్పటికీ ఇప్పటికీ మార్పులేదు కానీ అతని అంతరంగం మాత్రం పూర్వంలా-చలాకీగా లేదన్న అనుమానం కలుగుతోంది...

అప్పటి శాంతమూర్తి హుషారైన వాడు ఇప్పటి శాంతమూర్తి గంభీరుడు అతని పచ్చని శరీరం కొద్దిగా రంగు తగ్గి మొరటుదేలింది బహుశా నేను వచ్చీ రాగానే గమనిస్తే 'షాక్' తింటా నని కాబోలు తన విచిత్ర అనుభూతుల్ని కళ్ళ వెనకనే దాచుకుంటున్నాడు. ...

ఆ సాయంత్రం — 'వైట్‌హౌస్' ముందున్న గులాబీ తోటలో కుర్చీలు వేయించాడు ... అందులో కూర్చుని సిగరెట్లు వెలిగించుకుంటుండగా ... పని మనిషి-'టీ' తీసుకొచ్చాడు...

"నీకు పెళ్లయిందా?"—టీ తాగుతూ- అడిగాడు శాంతమూర్తి...

"లే"దన్నాను

"చేసుకుందే మాత్రం ఒక్క విష యాన్ని జాగ్రత్తగా పరిశీలించు... స్త్రీ తను ప్రేమించిన వ్యక్తికోసం, అతని ప్రేమకోసం సమస్త సంపద లనూ ఎలా విడిచివేయగలదో అలాగే తను కోరుకున్న సంపదకోసం తన ప్రేమనూ, ప్రేమికుడ్నీ కూడా వదిలేయ గలుగుతుంది నువ్ ఎంచుకునే అమ్మా యిలో ఈ రెండు లక్షణాల్లో ఏ లక్షణం ఎక్కువ కనిపిస్తుందో పరిశీలించు నా జీవితంలో నీకు నేను ఇవ్వగలిగిన అమూల్యమైన సలహా ఇదొక్కటే!"— అని ముగించాడు శాంతమూర్తి.

అతని మాటలకు తెల్లబోయాను నాకేమీ అర్థంకాలేదు ఇద్దరం లేచాం...

ఇల్లంతా చూపించిన తరువాత-మేడ మీద ఓ గదిలోకి తీసికెళ్ళాడు శాంత మూర్తి అది ఎప్పటినుంచో, తాళం పెట్టినట్టుంది గదినిండా దుమ్ము... చుట్టూ సాలెగూళ్ళు...గదిలోకి వచ్చిన వెలుతుర్నీ మమ్మల్నీ చూసి అంతవరకూ అందులో కాపురముంటున్న ఒకటి రెండు గబ్బిలాలు- బయటకు పారిపోయాయి.

అది చాలా విశాలమైన గది... అందులో గాలి ఎన్నాళ్ళనుంచీ ఖైదీగా

వుందో కానీ, ఓ విధమైన వాసనితో మా కెదురుగా దూసుకొచ్చింది గదిమధ్య నున్న టేబిల్ మీద-విస్కీ, బ్రాందీ, సీసాలు ఖాళీవీ, పగిలినవీ, మంచివీ, మరో మూడు గాజు గ్లాసులూ వున్నాయి. గది గోడలు మాసిపోయున్నాయి ... గోడ వారగావున్న గాజు బీరువాలలో చాలా చిత్రపటాలూ, చిన్నవీ, పెద్దవీ శిల్పాలూ, చెక్కబొమ్మలూ-పాలరాతి తాజ్‌మహల్ వున్నాయి శాంతమూర్తి కళాపిపాసని నాకెప్పుడో తెలుసు

"ఇవన్నీ నువ్వే సేకరించావా శాంతమూర్తీ"-అడిగాను—వాటి నన్నింటినీ పరిశీలనగా చూస్తూ

"కాదు!"_నిర్లిప్తంగా ఎటో చూస్తూ అన్నాడు శాంతమూర్తి

"మరెవరు?"-నాలో జిజ్ఞాస

అతను జవాబు చెప్పలేదు! ..

నన్ను మరో బీరువా దగ్గరకు తీసుకుని వెళ్ళి వాటి తలుపుతీసి చూపించాడు

"ఇందులోవి మాత్రమే నేను కలెక్ట్ చేశాను"— అన్నాడు

గాజు అద్దాల వెనుక-నేనెప్పుడో అతనికి వేసిచ్చిన బొమ్మలు పొందికగా అమర్చబడ్డాయి మసకగా వున్న అద్దాన్ని చేత్తో తుడిచి చూశాను రెండవ అర చివరిభాగంలో అంటించిన ఒక కాగితం నన్ను చాలా ఆశ్చర్యపరచింది తేరిపార చూశాను. అందులో యిలా రాసివుంది...

"కళాఖండంలో జీవకళను పొదిగి ప్రాణంపోసిన మరుక్షణం అది భావపూర్ణమైపోతుంది అలాగే కోరింది దొరికిన మరుక్షణం అదికూడా కేవలం భావపూర్ణమౌతుంది."—

ఆ దస్తూరీ మాత్రం శాంతమూర్తిది కాదని నాకు తెలుసు-ఎవరో స్త్రీ మూర్తి చేతి దస్తూరీలా వుంది ఆతృతను చంపుకోలేక-

"ఇది ఎవరు రాశారు శాంతమూర్తీ?" అని అడిగాను...

"ముందు ముందు నీకే తెలుస్తుంది" అంటూ ముందుకు నడిచాడు

శాంతమూర్తి జీవితంలో ఏదో విచిత్రమైన సంఘటన జరిగిందన్న సూచన అతని జవాబులో వినిపించింది నా కుతూహలం ఎక్కువైంది

ప్రతి వస్తువునూ పరీక్షగా చూస్తున్న నా కళ్ళకి ఏడడుగుల గాజు బీరువా-అందులో వెనక్కి తిరిగివున్న ఒక పురుషుని శిల్పం-పాలరాయిది-వుంది ఆ శిల్పం నడుం దగ్గర అడ్డంగా విరిగిన ఆనవాలు స్పష్టంగా కనిపిస్తోంది ...

నిశ్శబ్దంగా వచ్చి, నా వెనక నిలబడిన శాంతమూర్తి-

"ఆ మూర్తి నడుం విరిగిపోయి దాదాపు సంవత్సర మయింది చలం..."-అన్నాడు బాధగా

"మరి అది అలా వెనక్కి తిప్పి పెట్టబడిందెందుకూ? అదెందుకు అలా

విరిగిపోయింది ?...అదసలు ఎవరిది?"- నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా గది మూలకు తీసుకెళ్లాడు.

బిగిసిపోయిన కిటికీ రెక్కల్ని బల వంతాన తెరవగానే అందులోనుంచి దూసుకొచ్చిన వెలుతురులో—ఆ కిటికీ క్రింద ఒక చెక్కపెట్టె కనిపించింది. దానిపై నున్న దుమ్మును దులిపి, దాని తలుపు పైకి ఎత్తాడు.

అందులోకి చూడగానే నా తల తిరిగి పోయినంత పనయింది. అందులో జరీ పువ్వులున్న తెల్లనిచీర, తెల్లని పట్టు జాకెట్టూ వున్నాయి. ఏండిపోయిన ఎప్పటివో రక్తపు మరకలు వాటినిండా కనిపిస్తున్నాయి. నా కళ్ళు బైర్లు కమ్మాయి.

"శాంతమూర్తీ ! నువ్ ... నువ్వు హత్యచేశావా?''-భయంతో నా మాటలు తడబడ్డాయి..అతను నవ్వేసి నా భుజం మీద చేయి వేశాడు. "నువ్ అలా అను కుంటావని నాకు తెలుసు- కానీ నేను ఎవర్నీ హత్యచేయలేదు. ఆమె—ఆమె చచ్చిపోయింది-" అని మొహానికి చేతులు అడ్డు పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించాడు. ఏంచేయాలో తోచలేదు నాకు. కాస్సేపటికి తనను తానే సంబాళించుకుని-

"ఆ పాలరాతి మూర్తికీ-ఈమెకూ ఆ మూర్తి నడుందగ్గర విరిచ్చిన్నానికీ" ఈమె మరణానికీ సంబంధం వుంది"- అంటూ వేలితో చూపిస్తూ అన్నాడు శాంతమూర్తి.

"నీ మాటలు ఒకదానికీ-మరోదానికీ సంబంధంలేదు...నా కర్థం కావటంలేదు. ఈ సస్పెన్సు భరించలేను. ఏం అఘా యిత్యం జరిగిందో చెప్పు మూర్తీ...ఇంతకీ ఆ శిల్పం ఎవరిదీ?''—ఆగలేక అడిగే శాను

"నీ కుతూహలాన్ని అర్థంచేసుకో గలను చలం!...వీటన్నింటి వెనుకా పెద్ద కథ వుంది! భోజనాలయిన తరు వాత చెప్తాను. అయినా చీకటి కథలు చీకట్లోనే చెప్పుకోవాలి! పద-" అంటూ ఆ గదిలోంచి బయటకి నడిచాడు శాంత మూర్తి. చేసేదిలేక మౌనంగా అతన్ని అనుసరించాను.

ఆ రాత్రి...

భోజనాలయిన తర్వాత నన్ను తన 'బెడ్‌రూం'లోకి తీసుకెళ్లాడు. ఆ గదిని మాత్రం సాయంత్రం ఇల్లంతా చూపించి నప్పుడు, నాకు చూపించలేదు.

అక్కడ ఒక వైపున గోడకి వెల్వెట్ డ్రాప్-తొమ్మిదడుగులవి వ్రేలాడుతోంది దానిముందు ఒక చిన్న వేదిక ఆ వేదిక మీద ఆరడుగుల పేటిక ఒకటి నిలు వుగా, అమర్చబడివుంది. ఆ పేటిక తెల్లని పాలనురుగులాంటి వెల్వెట్ బట్టతో కప్పబడివుంది. దానిపైన ఉదయం ఉంచబడినవి కాబోలు-గులా బీలు—వాడిపోతూవున్నాయి.

ఇద్దరం ఆ పేటిక దగ్గరకు నడిచాం.

దానిమీదనున్న పువ్వుల్నీ—ఆ తెల్లని బట్టనీ తొలగించాను ఆశ్చర్య పోయాను చక్కగా పాలిష్ చేయబడిన నున్నని చెక్క పెట్టె అది! మరీ ఆశ్చర్య కరమైన విషయమేమిటంటే అది అన్ని ప్రక్కలా పూర్తిగా చెక్కతో మూసి వేయబడివుంది కానీ ముందువైపున మాత్రం, పై భాగంలో ఆరంగుళాల పొడుగూ మూడంగుళాల వెడల్పూ గల దీర్ఘచతురస్రాకారపు ఖాళీప్రదేశం వదిలివేయబడివుంది

అందులోకి చూసిన నేను నా కళ్ళని త్రిప్పుకోలేకపోయాను గదిలో వెలుగుతున్న బల్బు తాలూకు ఉజ్వలమైన కాంతి ఆ కంతలో పడుతోంది

ఆ కంత వెనుకగా, చాలా అందమైన, ఆకర్షణీయమైన రెండుకళ్లు - నా కళ్లల్లోకి చూస్తున్నాయి నా శరీరం జలదరించింది ఆ సువిశాలమైన కళ్లు ఏ అప్సరసవో అనిపించింది అవి నిశ్చయంగా ఎవరో స్త్రీమూర్తివి- పాలరాతితో చెక్కబడిన స్త్రీమూర్తి యొక్క విశాల విసీల సుందర నయనాలవి!

"శాంతమూర్తీ! ఈ పేటికకి తలుపు ఎటువైపుంది? ఈ శిల్పాన్ని చూడాలి!'' — ఆవేశంగా అడిగాను

"చూద్దువుగాని! కానీ అంతకు ముందు నేను చెప్పబోయే కథంతా వినాలి!" - అంటూ వెనుతిరిగాడు శాంతమూర్తి నిస్సహాయంగా అతన్ని అనుసరిస్తూ-

"పోనీ ఆ ప్రతిమ ఎవరో అదైనా చెప్పు"-అంటూ నీరసంగా అడిగాను... దానికి జవాబుగా-

"ఆమె ప్రతిమే? ఆమె పేరు నిజంగానే ప్రతిమ! నువ్ చూసిన ప్రతిమ కథ వినాలని నువ్వెంతగా ఆరాటపడుతున్నావో, ప్రియమిత్రునితో అదంతా చెప్పుకొని, మనసులోని బరువును దించుకోవాలని నేనూ అంతగా ఆరాటపడుతున్నాను - రా! . అలా నది ఒడ్డుకు పోదాం" - అంటూ నన్నా యింటికి సమీపంగావున్న నది ఒడ్డుకు తీసుకెళ్లాడు శాంతమూర్తి.

* * *

అన్నివైపులా మసక వెన్నెల పరచుకుని వుంది!

దేవదారు పైన్ వృక్షాలతో నిండి వున్న ఆ నదిఒడ్డు, మసకవెన్నెలా - నిశీధలతో కలిసి, నైరూప్య చిత్ర ఖండంలాగా కనిపిస్తోంది.

చెట్లన్నీ తమపైన చేరిన మంచుతో- తెల్లని మేలిముసుగుల్లో మెల్లగా కదల్తున్న పెళ్లికాని పిల్లల్లా వున్నాయి...

పైనంతా మంచు! ఎదురుగా జల జల సంగీతంతో ప్రవహిస్తున్న నది!

ఆ విచిత్ర భూలోక స్వర్గ సౌందర్యాలోకనంలో మునిగివున్న నన్ను -

"రా - ఈ చెట్టుక్రింద కూర్చుందాం"- అన్న శాంతమూర్తి మాటలు ఈ లోకంలోకి తెచ్చాయి అక్కడే ప్రవాహానికి దగ్గరలో వున్న ఒక ఆపిల్ చెట్టుక్రింద కూర్చున్నాం -

"నీ స్వగ్రామంలోకానీ - విజయ వాడ పట్టణంలోకానీ - డార్జిలింగ్‌లో కానీ - అమెరికాలోకానీ - చీకట్లోకానీ - వెలుతురులోకానీ - ఎక్కడైనా సరే అనురాగానికి అంకురార్పణం, వికాసం, పరిణామం ఒకే విధంగా వుంటాయి-" అన్నాడు శాంతమూర్తి హఠాత్‌గా, దగ్గరలో పడిన ఆపిల్ పండును చేతి లోకి తీసుకుంటూ...

"అందుచేతనే నీ మాటలు అనంద ర్శంగా వున్నా దానిలో విశేషాన్ని విన డానికి నా మనసు తొందరపడుతోంది- బహుశా నీది ఓ ప్రేమ కథేమోనని పిస్తుంది"... ఆసక్తిగా అన్నాను

"ప్రతి వ్యక్తికీ ఒక ప్రేమకథ వుండి తీరుతుంది... అలాగే నాకూ వుంది... విను మరి"-

గంభీరంగా చెప్పటం ప్రారంభిం చాడు శాంతమూర్తి... కుతూహలంతో వినసాగాను

"సరిగ్గా ఇవాల్టికి రెండు సంవత్స రాల క్రితం నాకు ప్రతిమతో పరిచయం అయింది... ఎక్కడో తెలుసా ?- తాజ్‌మహల్ ప్రాంగణంలో ! ఎలా చూపులు కలసి మనసులు కలసి మాటలు కలిసాయో - అదంతా వర్ణించి నీకు బోర్ కొట్టించను... టూకీగా చెప్తాను-

"... మా పరిచయం ప్రేమగా మారింది ఎన్నో జన్మల సంబంధం మా ప్రేమబంధంలో కనిపించింది. తిరిగి ఆగ్రానుంచి ఢిల్లీకి ఇద్దరం కలసి చేసిన ప్రయాణంలో మా ప్రణయం మరింత బలపడి - పరిణయం చేసుకుందామన్న నిశ్చయానికి మమ్మల్ని తెచ్చింది. దారిలో ఆమె కథంతా చెప్పింది... ప్రతిమకు చిన్నతనంలోనే తల్లి తండ్రీ పోయారు అందుకని తల్లిగారి తండ్రి వద్ద పెరిగింది... ఆమె తాతగారు ఢిల్లీలో పనిచేస్తూ 'రిటైర్' అయిన తర్వాత కూడా ఢిల్లీ వదల్లేదు ఆమె చదువంతా అక్కడే అయింది... 'మళ్లీ జీవితంలో కలుస్తామో లేదో' అని వాళ్ల క్లాస్‌మేట్స్ కొంతమంది కలసి ఆగ్రా ప్రయాణం పెట్టుకున్నారు

"...అక్కడ అనుకోనివిధంగా నాతో కలవటం, మర్నాడు ఆమె తాత గారితో మాట్లాడి శాస్త్రోక్తంగా పెళ్లి చేసు కోవటం జరిగిపోయింది మనుమరాలి అదృష్టానికి పొంగిపోయారు తాతగారు. ఆయనలో ఆనందం కట్టలు త్రెంచు కుంది పిడికెడు గుండె అంత ఆనందా నికి తట్టుకోలేకపోయింది శాశ్వతంగా కళ్లుమూసాడు అన్ని క్రియలూ పూర్తి చేసుకున నేను తప్ప మరెవ్వరూ లేని ప్రతిమను తీసుకుని కాశ్మీర్ చేరు

కున్నాను మూడు నెలలు భారత దేశంలోని సుందర ప్రదేశాలన్నింటిలో హాయిగా గడిపాం...

"...చివరకు ప్రతిమ కోరికమీద ఈ డార్జిలింగ్‌లో ఒక చిన్న భవంతి లాంటిది కట్టుకుని స్థిరపడ్డాం - అదిగో అదే ఆ భవంతి... దాని పేరు ప్రతిమా నిలయం"-

అతను వేలుతో చూపిన దిక్కుకు చూశాను - అవును! ఎదురుగా చిన్న కొండ, దానిమీద పాడుబడిన చిన్న భవనం - అంతకుముందు నేను గమనించలేదు దాన్ని చూస్తూంటే నా గుండెలు జలదరించాయి రక్తం గడ్డ కట్టినట్టయింది అది పాడుబడినా ఒక విచిత్రమైన అందాన్ని విరజిమ్ముతోంది. కానీ ఆ అందం భయోత్పాతాన్ని కలిగించేదిగా వుంది అందమైన పిశాచాన్ని చూస్తే కలిగే భయం లాంటిటిదది! భుజంమీద ఏదో బరువుగా పడేసరికి భయంతో వులిక్కి పడ్డాను అది శాంతమూర్తి చెయ్యి.

శాంతమూర్తి మళ్ళీ చెప్పటం కొన సాగించాడు.

"ఒకరి అంతరంగం కరుణతో నిండివుంటే మరొకరి అంతరంగం అగ్నితో నిండివుంటుంది. పరిస్థితికి కట్టుబడి జీవించేవాడిని 'సంస్కారి'

అంటుంది సమాజం. కానీ సంస్కారికి తన ఇష్టానికి కట్టుబడి జీవించే హక్కులేదు కదూ? - నన్నందరూ సంస్కారి అన్నారు ప్రతిమ కూడా నన్ను అలాగే అంది ఇష్టానుసారం స్వేచ్ఛగా జీవించనివ్వని సంస్కారాన్ని ఆమె ద్వేషించేది..

"...కానీ మా కాపురంలో మేమెప్పుడూ ఏ విషయంలోనూ ఘర్షణపడలేదు. కొన్నాళ్లు అతి మధురంగా సాగింది మా కాపురం - జీవితాన్ని నిర్లక్ష్యం చేసినట్లయితే అది అన్ని సుఖాల్నీ ఇస్తుంది - కానీ మేమిద్దరం కూడా జీవితానికే ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చాం అందుకే అది మాకు ఏ ఆనందాన్నీ సరిగా దక్కనివ్వలేదు మాలో ఎన్నో అభిప్రాయ భేదాలున్నా - అవి మా మధ్య సంఘర్షణ నేనాడూ తీసుకరాలేదు ఆమెలో నాకేనాడూ, నా పట్ల అసంతృప్తి కనిపించలేదు

" వేదాంతులు సాధారణంగా 'రమణీ హృదయ వేదన, రస హృదయ వేదన- సృష్టిలో ఈ రెండూ మిధ్యా బింబాయి' అంటారు కానీ ప్రతిమలో నాకు ఎన్నడూ అటువంటి ఆడంబరం కనిపించలేదు అయితే ప్రతిమ ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూనే వుండేది! ఆమె సహజంగా ఛరాకీగా - చైతన్యమే - ఆమె' అన్నట్టుగా వుండేది. కానీ రాత్రిళ్లు మాత్రం పడుకుని చాలాసేపు ఆలోచిస్తూండేది ఆమెయొక్క ఈ ప్రవృత్తులు నాకు అర్థమయ్యేవి కావు-

" సుఖదుఃఖాలు అన్యోన్యాశ్రితాలు - ఆలోచనా - అనుభూతులలో వాటి ఉనికి వుంటుంది. అందుచేత ఆమె ఆలోచనా భంగిమ నన్నెప్పుడూ ఆశ్చర్యపరచేది ఒకసారి ప్రతిమను ఆ సంగతే అడిగితే - నవ్వి వూరుకుంది - జవాబియ్యలేదు

" భగవంతుడు అన్నీ అందుబాటులో వున్నవాటినే కోరుతాడు.. కానీ మనిషి తనకు అందుబాటు లేనివి కోరతాడు. నేనూ, నా భావి జీవితాన్ని గురించి ఎన్నో ఆశించాను 'అనాసక్తిలోనూ- నిర్వాణంలోనూ నిజమైన శాంతి దాగివుంటుంది' ఆశలు మాత్రం దుఃఖానికి హేతువులు ఆ సంగతి నాకు అప్పట్లో తెలియదు నది పుట్టిన చోటునుంచి బయలుదేరుతున్న సమయంలో - ప్రవాహవేగంలో తాను ఏ దిశగా పోతోందో - ఏ సముద్రంలో పడుతుందో ముందుగా తెలియదు నా జన్మ అంతే అయింది - ఉన్నట్టుండి ఒకనాడు "

క్షణంసేపు చెప్పటం ఆపాడు శాంతమూర్తి"

నాలో ఆత్రుతా కుతూహలం మిన్నంటాయి

"ఏమయింది మూర్తీ తొందరగా చెప్పు తొందరచేశాను నేను శాంతమూర్తి కళ్ల

నుంచి అశ్రువులు నిశ్శబ్దంగా జారి పడ్డాయి. అతని కంఠం వణికి మంద్ర స్థాయిలో కథని కొనసాగించింది

ఆకాశంనుండి పడే ప్రతి వర్ష బిందువూ భూమిమీద పడ్డాక ధ్వని స్తుంది కానీ కానీ అది అశ్రు బిందువైతే కురిసే ముందుగానే హృద యంలో ధ్వనిస్తుంది కానీ ఇంతకు ముందు నా గుండెల్లో ఈ అశ్రువుల ధ్వని నీకు వినబడిందా ? – లేదుకదూ? నా హృదయ ఘోష కూడా అంతే। దానికీ కారణం వుంది, విను! .

' సహజమైన, చలనంగల, సజీవ మైన నా భార్య – ప్రతిమ జీవితంలో స్వాభావికమైన ప్రకృతి పిలిచిన పిలుపు ఆమెకు ఒక సమస్యయింది ఆ సమస్య గురించి ఆలోచించీ – ఆలోచించి, చివరికి ఒక పరిష్కారాన్ని నిర్ణయించు కుంది దాని ప్రకారం ఆమె – నా అంగీకారంతో నన్ను త్యజించి నాకంటే స్థితిపరుడూ – కోటీశ్వరుడూ అయిన సారధిని వివాహమాడి అమెరికా వెళ్లి పోయింది – పరిగ్రహణం, పరిత్యాగం– ఈ రెండూ సంతోషకరమైన మానసిక దశలు . అందుచేతనే ప్రతిమ నన్ను పరిత్యజించింది . "

శాంతమూర్తి చెబుతున్నది వింటూ విస్తుపోయాను

"ఏమిటి మూర్తీ ' సారధితో వివా హానికి – భర్తవైయుండీ నువ్ అంగీ కరించావా ?... ఆమె పరిత్యాగానికి బలి అయిపోయావా ?"– నాలోని కలవర పాటును గమనించి దీర్ఘంగా నిట్టూర్చాడు శాంతమూర్తి

''అవును చలం?... ఏం చెయ్యను? ఆమెను గాఢంగా ప్రేమించాను అంత కంటే ఎక్కువగా ఆరాధించాను. ఎప్పుడూ – ప్రతిక్షణం. ఆమె సుఖాన్నే కోరేను నాతోకంటే సారధితోనే సుఖంగా వుండగలనంది అలా ఎందు కన్నదో అడక్కుండానే – ఆమె సుఖాన్ని మాత్రమే కోరుకున్న నేను – ఆమెకు ఎదురు చెప్పలేదు ! విడాకు లిచ్చాను ప్రేమ గుడ్డిది కదూ ? ' శాంతమూర్తి బాధగా తల ఒకవైపు వాల్చి, నెమ్మదిగా చెప్పాడు

"చలం! నా ఉద్దేశ్యం చెప్పాలంటే నిజానికి కోరిక తీర్చుకోవటంలో సుఖం లేదు కోరికను చంపుకోవటంలోనే సుఖం వుంది। ఇది నాకు అనుభవ మైంది దీన్ని 'త్యాగం' అంటూ పొగిడి వెళ్లిపోయింది ప్రతిమ ఒక కోరిక తీరడమే, మరో కోరిక జనించటానికి కారణం ! అది ఆమెకు అనుభవమైంది.

"ఏమిటి మూర్తీ ఆమె అంత ధైర్యంగా – సుఖంగా పతనం చెందిందా ?"– నాకు నిజంగా ఒళ్ళు మండిపోతోంది.

"లేదు లేదు ! అలా అనకు ? నేను భరించలేను సర్వదేవతాశీర్వాదంతో

వజ్రమయమయిపోయిన అంతర్యం కూడా ఆరాధన కలిగితే క్షుద్ర జీవాన్ని కూడా శిరస్సున ధరియిస్తుంది! కానీ ఆమె క్షుద్ర జీవికాదు నాకు పవిత్ర మూర్తి!, ఆరాధ్య దేవత!"– అతని మాటల్లో ఏదో వెలుగులాంటి తృప్తి వినిపించింది.."

'ఏమిటి? పతనంలో కూడా పవిత్రత వుందా శాంతమూర్తి?" నా ప్రశ్నకు అతను 'వుంద'ని సమాధాన మిచ్చాడు

"నిన్నింత దుఃఖపెట్టిన ప్రతిమను నువ్వింత ఆరాధిస్తున్నావా?... ఆమెకు ఇంత విలువనిస్తున్నావా?"– ఆశ్చర్యంతో అడిగాను

"అవును! దుఃఖం చాలా విలువైనది.. అందులోనే విషాద మాధురి ఇమిడి వుంది... సాధారణంగా ఏడవటం చేత నైన వాళ్లే ఏడిపించగలరు! కానీ ఎప్పుడూ నగుమోమే ఆభరణంగా గల ప్రతిమ నాకు ఆ విలువైన ఏడుపునే మిగిల్చింది... ఇద్దరు వ్యక్తుల్ని – రెండు మనసుల్ని – దగ్గరగా కట్టి పడేసేది ఏడుపు! ఏడుపుకు నిర్వచనం ఏడుపే చలం!.."– అంటూ నిశ్శబ్దంగా రోదించాడు... ఓదార్పు కోసం – శాంతమూర్తి భుజంమీద చెయ్యేసాను గబగబా అతను కళ్లు తుడుచుకుని వణికే గొంతుతో–

"సారీ బ్రదర్! అంతర్యానికి విషాదం ఆవరించినప్పుడు జీవితం దుర్భరం అవుతుంది... సానుభూతి పరులు విషాదాంతరంగాన్ని స్పృశించి నప్పుడు దుఃఖాన్ని వాంఛిస్తుంది మనసు"– అంటూ చిన్నగా నవ్వేడు మూర్తి ఆ చిరునవ్వు చిందించిన విషాదాన్ని మౌనంగా దిగమింగాయి నా కళ్లు.

"చూడు చలం!– నిశ్శబ్దమే భాషగా నిశ్శబ్దగీతమే మహా సంగీతంగా ఇన్నాళ్లూ బ్రతికిన ఈ మనిషి ప్రియమిత్రుని సన్నిధిలో పంచగలిగేది విషాదాన్నీ – ఇన్ని బాష్పాలనూ మాత్రమే!"– శాంత మూర్తి మాటలకు నా హృదయం ద్రవించింది ఎన్నడూ చూడని ప్రతిమ మీద పరోక్షంగా ఎంతో ఆగ్రహం కలిగింది అప్రయత్నంగా నా కళ్లు నీటితో నిండిపోయాయి అది కనపడ కుండా జాగ్రత్త పడుతూ–

"ప్రతిమ ఇప్పుడు అతనితో అమెరికాలోనే వుందా మూర్తీ?"– మెల్లగా అడిగాను

"లేదు? మళ్లీ వచ్చేసింది!"– అతని జవాబు

"అహా! వచ్చేసిందా? ఇప్పు డెక్కడుంది మరి?"–

"ఇప్పుడెక్కడుందో తర్వాత చెప్తాను! ఆమె నన్ను విడిచి వెళ్లి పోయాక – ఏడు నెలల తర్వాత ఒక నాడు హఠాత్తుగా ప్రతిమ బెంగుళూరు



నుంచి ఉత్తరం రాసింది. . ఆ చిన్న భవనాన్ని - అదే-ప్రతిమా నిలయాన్ని తన భర్త సారధికి అమ్మమంటూ - ప్రార్థిస్తూ రాసింది ఆమెకి ఇక్కడే- ఆ భవంతిలోనే స్థిరపడాలనుందని కూడా రాసింది !"- అంటూ ఎదురుగా కనిపిస్తున్న - ఆ చీకట్లో - ప్రతిమా నిలయాన్ని చూపించాడు మళ్ళీ.

"అమ్మేశావా మూర్తీ ?''- అప్రయత్నంగా - నా కంఠంలో కుతూహలం ధ్వనించింది

"లేదు ! బహుమతిగా ఇచ్చేశాను అందుకామె ఎంతగానో సంతోషించిందని తెలిసింది వాళ్ళిద్దరూ వచ్చి అందులో స్థిరపడ్డారు. చిలకా గోరింకల్లా వున్నారు"- శాంతమూర్తి మాటలు వింటూంటేనే నా గుండెలు పిండినట్లయింది అతను ఎలా భరించగలిగాడో గాని !

''ఘోరం ! నీ కళ్ళముందే..."

"అవును !.. ఆ యిల్లు ఆమెకిచ్చేసి ఇప్పుడు నేనుంటున్న బంగళా కొనుక్కున్నాను"-

"శాంతమూర్తీ! నాకో అనుమానం!- ఆమె - అసలు సంపదకోసమే నిన్ను విడిచి వెళ్ళిందా ?"-

''అవును !... నో కాదు !"-

''అదేం సమాధానం ? అయినా డబ్బుకి నీకేం లోటు ? నీకన్నా ధనవంతుడా ఆ సారధి ?"

''అవును చలం ! నేను లక్షాధికారిని మాత్రమే ! . అతను కోటీశ్వరులకు కోటీశ్వరుడు !"-

"అన్యాయం మూర్తీ ! నువ్వే కట్ల

మూసుకపోయిన ప్రేమ బికారివి! పిరికి వాడివి! కాదు - పిచ్చివాడివి!"- అరిచాను

"కాదు! పిరికివాడ్ని కాదు నేను! తెలిసి ఏ తప్పు చెయ్యని నేను, నా గుండెలపై ధైర్యంగా ధరించినది రత్న మాణిక్యాల హారాన్ని కాదు నా చేతిని!"-

"మూర్తి! నీ ఆత్మవంచనను నేను ఆమోదించలేను నీ కళ్ళముందే నీ భార్య మరొకడితో-"

"చలం!"- ఆవేశంగా అరిచాడు మూర్తి

"ఆమె కేవలం - నా భార్య మాత్రమే కాదు నా దేవి!"- అతని కేకతో నదీ ప్రవాహం భయపడి ఆగి పోయిందేమో ననిపించింది! నా ఆవేశానికి పశ్చాత్తాపంతో- 'సారీ' అన్నాను

అతను కరుణతో చిరునవ్వు నవ్వి మామూలు గొంతుతో ఇలా అన్నాడు.

"ఫరవాలేదులే! అనురాగం, ఆవేశం - స్నేహమనే పావురానికి రెండు రెక్కలు ఆమెను నేనెందుకు దేవతగా ఆరాధిస్తున్నానో ముందు ముందు నీకు తెలుస్తుంది - విను! - అలా ప్రతిమా నిలయానికి వెనుకగా-కొంచెం దూరంగా వున్న పెద్ద కొండమీద శిథిలమైన పాత కోట నాకు నేస్తమైంది

" ప్రతిమ నన్నొదిలి వెళ్లి పోయిం తర్వాత ప్రతి సాయంకాలం నేను ఆ కోటవైపు షికారు వెడుతూండే వాడిని! అందులోనే శిథిలాల మధ్య తిరుగుతూంటే - నా శిథిల హృదయానికి అవి తోడు దొరికినట్టు అనిపించేది. . ఎంతో ఓదార్పు కలిగేది అక్కడ్నించి- రోజూ ఆ చిన్న భవంతిని చూస్తున్నా - ఎన్నడూ ప్రతిమవున్న ఆ ఇంట్లోకి వెళ్ళలేదు అసలు ప్రతిమ నన్ను విడిచి వెళ్లింతర్వాత అప్పటివరకూ ఆమెను మళ్లీ కలవలేదు - మాట్లాడలేదు!"- మూర్తి క్షణంసేపు బాధగా కళ్లు మూసుకున్నాడు

అప్రయత్నంగా ఆ భవంతివైపు చూశాను భయంవేసింది, చీకటి రాజ్యమేలుతున్న - ఆ యింటి కిటికీలకి- ద్వారాలకి - ఊడిపోగా మిగిలివున్న తలుపులు గాలికి ఊగుతూ రమ్మని పిలుస్తున్నట్లనిపించింది- మసక వెన్నెల్లో ఆ భవనం కదుల్తూ - అటూ ఇటూ వూగుతూ- నా వైపుకు రాబోతూ నన్ను బెదిరిస్తున్నట్లు కనిపించింది . అది నాకు కదులుతున్న ఒక అందమైన ప్రాణం లేని దిష్టిబొమ్మలాగా కనిపించింది... నా కళ్ళ మధ్య చలి చీకటితో కలసి ఖరేల్మంది .

"చలం .. పద అలా వెడదాం . నా ప్రేమ మహల్ దగ్గరకి! దాన్ని నీకు చూపించాలి!"- అంటూ అతను లేచే సరికి నా గుండె 'గుభేల్' మంది నా పరిస్థితిని గమనించాడు కాబోలు-

"ఫర్వాలెదు! భయం లదుల రా అందులో ఇప్పుడెవ్వరూలేరు!"- అంటూ నాకు చెయ్యి అందించాడు.

అతనితోబాటే గుండెలు చిక్క బట్టుకుని నడవక తప్పలేదు శాంత మూర్తిలోమాత్రం లేశం కూడా భయం కనిపించటంలేదు నెమ్మదిగా ఆ గుట్ట లాంటి చిన్న కొండని ఎక్కటం ప్రారంభించాం ఆ మేడ దగ్గరవుతున్న కొద్దీ నన్ను మ్రింగటానికి వస్తున్న భూతంలా కనిపిస్తున్నది అది! - పావు గంట నడిచి దాని ముందుకు చేరు కున్నాము.

ముందువైపు ఓపెన్‌గా వున్న పొడుగుపాటి వరండా వుంది దానికి పైన రెండవ అంతస్థుమీద 'ప్రతిమా నిలయం' అన్న అక్షరాలు అవి కూడా ఎంతో అందంగా వున్నాయి దాని లోపలంతా చీకటిగా వుంది - ఆ భవనం అంత పెద్దదీ కాదు - మరీ అంత చిన్నదీకాదు గోడలన్నీ మట్టి కొట్టుకుని మసిబారి వున్నాయి

ఆ భవనం పై అంతస్థులో ముప్పా తిక భాగం - పైకప్పు కూలిపోయింది లోపల తప్పకుండా పిశాచాలు సభ చేస్తున్నాయేమో ననిపించింది - గాలికి తలుపులు చేస్తున్న చప్పుడు నా గుండెల మీద కొడుతున్నట్లుగా వుంది ఏవో కీటకాలు చేస్తున్న శబ్దాలు భయం కరంగా వినిపిస్తున్నాయి - దిగులుగా దగ్గుమిస ఎక్కడ అంగ చూశాను. శాంతమూర్తి కనిపించలేదు... గుండెలు ఝల్లుమన్నాయి "శాంతమూర్తీ!"... భయంతో గొంతుక చీరుకపోతూండే అరిచాను.

"చలం! - ఇక్కడే వున్నాను!"- నా వెనుకనుంచి మూర్తి గొంతు విని పించింది - వెనక్కి తిరిగి చూశాను - అక్కడకు పదడుగుల దూరంలో ఒక రాయిమీద కూర్చుని వున్నాడు నా గుండె కుదుటపడింది అతన్ని చూడ గానే - వెళ్ళి అతని ప్రక్కనే మరో రాయిమీద కూర్చున్నాను

నేనలా కూర్చుంటూండగా అతనే అన్నాడు-

''ఈ ఇంట్లో ఇప్పుడెవరూలేరు! - ఎందుకలా భయపడ్డావ్?" - అని

నా భయాన్ని కప్పిపుచ్చుకుంటూ- మాట మార్చాలని అడిగాను.

"ఆమె తిరిగొచ్చి ఈ భవనంలో ఉంటున్నప్పుడయినా నిన్ను ఎప్పుడూ వాళింటికి ఆహ్వానించలేదా? - సారధిని పరిచయం చేయలేదా? - అని."

''లేదు! అలా ఎన్నడూ చేయలేదు- కానీ ఈ భవనంలోకి వచ్చాక తరచుగా- వారానికి రెండు మూడు ఉత్తరాలు మాత్రం నాపేర రాసేది ఒకనాడు తన జ్ఞాపకార్థం నాకు బహుమతిగా తన పాలరాతి ప్రతిమను పంపించింది. "-

అతని మాటలు నా కాశ్చర్యాన్ని కలిగించాయి–

''అదేమిటి మూర్తీ నిన్నింకా కోరు తోందా ఆమె ?–''–

''అవును చలం ! – ఆమె నన్నెప్పుడూ కోరుకుంటూనే వుండేది అదే స్త్రీ హృదయంలోని విచిత్రం – స్త్రీ అంతర్యం తాలూకు సమగ్ర స్వరూపం మాత్రం అంత తేలికగా బయటికి కనిపించదు–''–

''మరి ఆ విగ్రహానికి – కళ్లు మాత్రమే కనబడేలా ఖాళీవుంచి మిగిలినదంతా కాయ్యతో అలా మూసివేశావెందుకని ?'' – నా సందేహం విని ఒక్క క్షణం తటపటాయించి నెమ్మదిగా చెప్పాడు మూర్తి

''ప్రతిమ పరకాంత అయిపోయింది– పరపురుషని స్పర్శను పొందిన నా భార్య శరీరాన్ని చూడగలిగే ధైర్యం లేక, ఆ కళ్ల తప్ప తక్కిన భాగాన్ని కప్పేశాను–''

''మరి కళ్లు పవిత్రంగా వున్నాయా ? ''– నా ప్రశ్న నాకే విచిత్రంగా, వ్యంగ్యంగా, కర్కశంగా ధ్వనించింది

''అవును ! అవి పవిత్రమైనవే ! ఆ భౌతిక చక్షువుల్ని చూడకుండా వుండ లేను ! ఎందుకంటే – అవి ఆమె మనసు తాలూకు కిటికీలు – ఆమె చూపులు మాత్రం పవిత్రమైనవి – నన్ను అత్యంత అనురాగంతో చూస్తుంటాయి ఆ కళ్లు ! అవసలు కళ్ళు కాదు చలం !– వలపుల వాకిళ్ళు ! – ఏదైనా సంగీత వాద్యాన్ని చూడగానే దానితో ఏదో చెప్పుకోవాలనీ – దానిచేత రాగాలు పలికించాలనీ తపించిపోతాడు కళాకారుడు ! – అలాగే – నాకూ – నా కూడా ఆ కళ్ళతో ఏదో ఆవేదన చెప్పుకోవాలనే తపన కలుగుతుంది !– కానీ అవి బదులు చెప్పవు ! – అయితే– ఆ కళ్లలో నాపట్ల కనబడే అనురాగం– ఎప్పటికైనా అవి నాతో మాట్లాడుతాయన్న ఆశా– ఈ రెండూ నన్నింకా ఈ లోకంలో వుంచాయి''–

''ఎంత అమాయకుడివి మూర్తీ నువ్ !''– మనసులోనే అనుకున్నాను నేను

''నువ్వు వేసిన చిత్రాల ప్రక్కన అంటించిన 'నోట్' చూశావుగా ! – అది ప్రతిమే రాసింది – అందులో భావం నీకు అర్థమయిందా ?''– నా కళ్లల్లోకి చూస్తూ అడిగాడు మూర్తి.

విస్తుపోతూ – ''కాలేదు'' అన్నాను.

''నువ్ నీ బొమ్మల ద్వారా– నాకూ ప్రతిమకీ కూడా దగ్గయ్యావ్ – ప్రతిమ భావుకురాలుకూడా !– అందుకే మా యిద్దరి సంసారం ఒక కళాఖండమని వర్ణించేది – ఆ కళాఖండంలో – మన ఇద్దరి స్నేహమనే జీవకళను పొదిగి ప్రాణం పోస్తే అది కళాకారుడివైన

నీకు భావపూర్ణమైపోతుందిట— నీ బొమ్మల్ని చూసి ప్రభావితురాలై ఆమె అలా అప్రయత్నంగా రాసి పెట్టిందక్కడ. .

" ఆమె రాసింది నిజమే అయింది చలం – నువ్ వచ్చావు – నీ రాక నాలో కొంత క్రొత్త ప్రాణాన్ని పోసి జీవ కళను పొదిగింది. అది ఇక నీకు భావపూర్ణం కాబోతూంది – ప్రతిమ మాట ఎప్పుడూ పొల్లుపోదు.. "—

శాంతమూర్తి మాటలు నాకేం అర్థం కాలేదు. అందుకే వాటిని అర్థంచేసుకునే ప్రయత్నాన్ని అలా వదిలిపెట్టి అతన్ని తొందరచేశాను–

"నాకు కావలసింది నీ పొగడ్త కాదు మూర్తీ – నీ కథ – టూకీగా చెప్పు !— ఈ సస్పెన్సు భరించలేకుండా వున్నాను. నీకు ప్రతిమ పుత్తరాలు ఇంకా ఎందుకు రాసేది ?'' – అంటూ ఆత్రంగా అడిగాను.

తన కథ మళ్లీ చెప్పటం ప్రారంభిం చాడు

"ప్రతిమ సారధిని పెళ్లిచేసుకున్న తర్వాత కూడా నన్నే ప్రేమించేది ఆమె నాకు రాసే వుత్తరాలలో మేమిద్దరం గడిపిన మధురక్షణాలనూ ఆనందోత్సవాలు చేసుకున్న సాయం కాలాలనూ గుర్తుచేస్తూ రాసేది మా ఇరువురి మధ్యా శారీరక సంబంధం అంతగా ఎన్నడూలేదు... అనురాగం వుంది... ఆరాధన వుంది... అంతే!"-

'షాక్' తిన్నాను

"అదేమిటీ! మరి మీరిద్దరూ పెళ్ళి ఎందుకు చేసుకున్నట్టు?"- ఉండలేక అడిగేశాను

శాంతమూర్తి నవ్వేడు ఆ నవ్వు నా అమాయకత్వాన్ని చూసి నవ్విన నవ్వులా వుంది...

"అమాయకుడా! శారీరక వాంఛల కోసమా వివాహం?... కాదు...ఇద్దరు వ్యక్తుల సహవాసంకు - వారి సాహ చర్యాన్ని మరింత దగ్గరచేసేందుకు కల్పించే కట్టుబాటు!... 'పతితులు'- 'పతనం అనే బిరుదులు ఇవ్వకుండా సంఘంనుంచి కాపాడుకుందుకు చేసుకునే తతంగం... మా ఇద్దరికీ అలాంటి వాంఛలులేవు. ఆమెను నేను ఎంతో పవిత్రంగా - ప్రేమతో ఆరాధించే వాడిని అలాగే ప్రతిమ కూడా నన్నెంతో గౌరవంతో అనురాగంతో, పూజించేది- మాది నిర్మలమయిన అనురాగం మాత్రమే!...

"... ఒకరి సన్నిధిలో ఒకళ్ళం- ఆనందాన్ని అనుభవించేవాళ్లం ఒకరి కళ్లల్లోకి ఒకళ్ళం- అనురాగంతో చూసుకుంటూ ఈ లోకాన్నే మరచి పోయేవాళ్ళం... కానీ...

"...కానీ ఆమెకు ఒకరోజున షాపింగ్‌లో తారసపడిన సారధితో ఏర్పడిన పరిచయం మా జీవితాల రంగుల్ని మార్చేసింది ప్రతిమను విడిచి బ్రతకటం ఎంత కష్టమని నేను అను కునేవాడినో, అంత సులువుగానూ - నన్ను వదలి వెళ్ళిపోయింది... ఆమె తిరిగి ఈ భవంతిలోకి వచ్చాక ఆమె నుండి నాకొచ్చే ప్రేమలేఖలు ఉద్వేగ పూరితంగా వుండేవి...

"...ఒకసారి 'నీ ప్రేమ ఎంత స్వార్థరహితమో- ఎంత పవిత్రమైనదో- పరీక్షించాలని సారధిని చేసుకున్నాను'- అంటూ రాసింది... అది చదవగానే నా గుండెల్లో పిడుగులు వర్షించాయి... ప్రేమకి పరీక్షా?... అందులోనూ నా ప్రేమకు- నేనెంతగానో ప్రేమించే నా ప్రతిమ పరీక్ష పెట్టిందా?-

"... ఆ వుత్తరంతో నా మనసు దెబ్బతింది ఆమె నాకు ఇంకా ఇంకా అర్థంకాకుండా పోతున్నట్లే అని పించింది. అంతేకాదు మరోసారి . ఆమెకు సారధితో పెళ్లయినాక అతనితో

గడిపిన మొదటిరాత్రి అనుభవాలను రాస్తూ- 'నేను నీతోనే మొదటిరాత్రి గడిపినట్టు ఊహించుకుంటూ - మన పవిత్ర ప్రేమకు ప్రకృతి సహజమైన పరిపూర్ణతను చేకూర్చుకొనగలిగాను శాంతమూర్తీ'- అంటూ రాసింది

"... ఆ తర్వాత రాసిన ఉత్తరాల నిండా, సారథితో గడుపుతున్నా అతని స్థానంలో నన్నూహించుకుంటూ ఎలా శారీరక తృప్తిపొందుతోందో- అనూయకంగా - ఉత్తేజకరమైన భాషలో రాసేది... నిజానికి ఆ వుత్తరాలు నన్ను క్రుంగదీసేవి!... నా సహనాన్ని పరిక్షించేవి! అందుకే నేను ఏ వుత్తరానికీ జవాబియ్యలేదు... కానీ వాటిని మళ్ళీ మళ్ళీ చదివిన నా కళ్ళు అలసిపోయి మసకబారేవి... కన్నీరు అడ్డుపడితే పూర్తిగా గ్రుడ్డివైపోయేవి "

మూర్తి కథలో ఒక్కొక్క ఘట్టం నన్ను ఒక్కొక్క అయోమయ అవస్థలోకి లాగేస్తూంటే అడిగాను-

"మూర్తీ! ఆమె శారీరక సుఖం కోసమా- నిన్ను వదలి సారథిని చేసుకున్నది?... అంతే కానీ..."-

నన్ను వారిస్తూ-

"కాదు కాదు! వాంఛలతో నన్ను మలినపరచే అనురాగంకాదు ప్రతిమది... అందుకే ఆమె నన్ను ఆ దృష్టితో కోరలేదు కానీ ఆమె స్త్రీ! నిజమైన స్త్రీ!... సారథి కూడా ఉత్తముడు. అతన్ని కూడా మనసారా ప్రేమించింది... ఆ ప్రేమ వేరు... ఈ ప్రేమ వేరు... అనుభవించినవాళ్ళకే అది అర్థమవుతుంది... శారీరకంగా తాను నన్నొదిలి వెళ్ళిందేకానీ- మానసికంగా నాలోనే వుంది... నాతోనే వుంది! నా అణువణువులోనూ ఆమె నిలిచిపోయింది తన ప్రతి భావనలోనూ నన్ను నిలిపింది!... ఇప్పుడు చెప్పు చలం! .. ఆమె దేవత కాదూ?... ఈ సంఘం, ఈ సమాజం, ఈ ప్రపంచం, దీన్ని హర్షించకపోవచ్చు... కానీ నేను హర్షిస్తాను... అందరి దృష్టిలోనూ నేనూ, ప్రతిమా పిచ్చివాళ్ళం...

"... కానీ నాకామె దేవత... నాకు దే వ త!..."— రహస్యం చెబుతున్నట్టుగా అన్నాడు శాంతమూర్తి

నా మనసు కరిగిపోయింది అతన్ని అమాయకునిగా భావించాలో - వెర్రివాడనుకోవాలో తెలియలేదు కానీ అతనిది చాలా సున్నితమైన హృదయమని గుర్తించాను మనసారా కౌగలించుకున్నాను...

"నేను నిన్ను పూర్తిగా అర్థం చేసుకున్నాను మూర్తీ'... ప్రతిమ నిజంగా అదృష్టవంతురాలు... నీవంటి ప్రేమమూర్తి అనురాగాన్ని ఎల్లవేళలా పొందింది .. ప్రపంచం మీ అనురాగాన్ని గుర్తించకపోవచ్చు... కానీ ఆ భగవంతుడు గుర్తించకపోడు"—

అని నేను అంటూండగానే- ఆకాశం ఫెళఫెళమని ఉరిమింది ఎప్పుడు మేఘాలు క్రమ్ముకున్నాయో గానీ— హఠాత్తుగా వర్షం ప్రారంభమైంది—— గాలి ఉద్ధృతంగా వీస్తూండటంవల్ల మేఘాలు పరుగులు తీస్తున్నాయి ఆ మేఘాల పరదాల మాటున చిక్కుక్కున్న చంద్రబింబం తప్పించుకోవటానికి ప్రయత్నిస్తూనే వుంది!——

వర్షం ప్రారంభమైనా - గాలి విపరీతంగా వీస్తున్నా అక్కడ్నించి లేవాలనిపించలేదు! . అతని విచిత్రమైన జీవితగాధని వినాలన్న కుతూహలమే నన్నక్కడి నుంచి కదలనివ్వలేదు! .

"తర్వాత ఏం జరిగింది శాంతమూర్తి?" అనునయంగా అడిగాను.

"అలా వుత్తరాలు రాస్తూనే వుండేది ప్రతిమ ఒకనాటి రాత్రి — ఇలాగే అనుకోకుండా తుఫాను వచ్చింది నేను నా మేడమీద గదిలో-కిటికీ దగ్గర కుర్చీవేసుకుని కూర్చున్నాను ఆ కిటికీ లోంచి - అలా - ఈ భవనంవైపు చూస్తూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నాను . ఆకాశం ఉండి ఉండి గర్జిస్తోంది మెరుపు తీగలు కళ్లను చురుక్కుమనిపిస్తున్నాయి చలిగాలి చెవుల్లోకి దూసుకుంటూ వస్తోంది-

"...అంతలోనే- ఆ క్షణంలోనే- నాకు ఎదురుగా కనిపిస్తున్న 'ప్రతిమా నిలయం' పై కప్పు ముందు భాగం కదలినట్టుగా నా కళ్లకు కనిపించింది- అప్రయత్నంగా 'ప్రతిమా' అంటూ అరిచాను , నా కేక ఉరుముల ధ్వనిలో కలిసిపోయింది నా గుండెల నెవరో ముక్కలు చేసినట్లయింది...

"... బరువెక్కిన హృదయంతో, చలినీ, తుఫాన్‌నీ, లెఖ్ఖచేయకుండా 'ప్రతిమా ప్రతిమా' అని కేకలు పెడుతూ- పరుగులాంటి నడకతో ఇటు వచ్చాను- నేననుకున్నదే నిజమైంది!...

"...నేనిక్కడికి చేరేసరికి ఈ భవతి ముందుకప్పు ఇలాగే కూలిపోయివుంది! గబగబా లోపలకు వెళ్లాను ముందు గదిలో పడిన 'పైకప్పు' తాలూకా శిధిలాలను తొలగించటానికి సారధి తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. నన్ను అతను విచిత్రంగా చూశాడు ఓసారి...

"...అతనికి నేనెవరో తెలియదు. బహుశా నా గురించిన వివరాలు ప్రతిమ అతనితో ఎప్పుడయినా చెప్పేవుండాలి! అదిరే గుండెలతో ఆ శిధిలాలను తొలగించి, ప్రక్కనే పడివున్న 'బీరువాను' నిలబెట్టాం మరుక్షణం క్రిందికి చూసి కెవ్వుమన్నాను . నా కేకతో కలసి ధ్వనించింది సారధి చేసిన విషాదకరమైన ఆర్తనాదం

"...నేలమీద ప్రతిమ తల పగిలి పడివుంది నా ప్రతిమ మరణించింది..



ఆమె ప్రక్కనే— విరిగిన విగ్రహం.. తెల్లని జరీ పూవుల చీరలో, తెల్లని పట్టు జాకెట్టులో ఎర్రని రక్తపు వెల్లువలో నిర్జీవంగా పడివుంది నా ప్రతిమ- అన్నట్టు ఆమె ప్రక్కన విరిగి పడి వున్న విగ్రహం ఎవరిదో తెలుసా?... అప్పుడే నేనూ చూశాను అది నాదే చలం! నాదే!

"...అంతలో సారధి నా భుజం మీద చేయివేసి, కన్నీళ్లతో చెప్పాడు- ఆమె ఎప్పుడూ తనను ఆ గదిలోకి- అంటే తన గదిలోకి రానివ్వలేదనీ- అసలు ఆ విగ్రహం ఎప్పుడు తెప్పించిందీ తనకు తెలియదనీచాలా రాత్రులు పొద్దుపోయేవరకూ ఆ గదిలోనే గడి పేదనీ చెప్పాడు

"... ప్రతిమను తలచుకుంటూ వెక్కి వెక్కి ఏడ్వటం ప్రారంభించాడు అతన్ని ఓదార్చే శక్తి నాకు మాత్రం ఎక్కడిదీ? నా ప్రేమదేవత- శాశ్వతంగా అనంతవాయువుల్లో కలిసిపోతే నా మనసుకు మాత్రం ఓదార్పు కావద్దూ?...

"... ఆ తరువాత, ప్రతిమ జ్ఞాపకార్థం- ఆమె ఆఖరి రోజున ధరించిన ఆ ధవళవస్త్రాన్నీ పగిలిన నా హృదయానికి ప్రతిబింబంగా అక్కడే పడి వున్న నా ప్రతిమనూ తెచ్చుకున్నాను ఎందుకూ, ఏమిటీ అని సారధి అడగలేదు "- అని ముగించి, ఇంకేమీ చెప్పవలసింది లేదన్నట్లు తన చేతుల్లో మొహం దాచుకుని రోదించసాగాడు.

"అయితే ఇంతకు ముందు నీ పాత గదిలోని అద్దాల బీరువాలో వెనక్కి తిరిగి వున్న శిల్పం నీదేనన్నమాట!" అస్పష్టంగా అడిగాను..

'ఔ'నన్నట్లు తల ఊపాడు శాంతమూర్తి.

ఇక మాట్లాడటానికి మరేమీ మాటలు అందలేదు నాకు. అప్పటికే వర్షంలో చాలావరకూ తడిసిపోయాం మసక వెన్నెల పడుతున్నా దూరాన దట్టంగా అల్లుకున్న నల్లమబ్బుల్లోంచి అప్పుడప్పుడు మెరుపులు మెరుస్తున్నాయి

ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు ఇంకిపోగా నిశ్శబ్దంగా, నిర్వికారంగా కూర్చుండిపోయాడు శాంతమూర్తి

ఆ భయంకర నిశ్శబ్దాన్ని భగ్నం చెయ్యకపోతే అతని గుండెలు మరి బిరువెక్కి పోతాయేమో ననిపించింది అందుకే అతని భుజాలమీద చేతులేసి -

"మరయితే ఇప్పుడు సారథి ఎక్కడున్నాడు ? ఏమయ్యారు ?" అని అడిగాను

వెంటనే సమాధానం చెప్పలేదు మూర్తి తల వంకుచుని కళ్లు మూసుకున్నాడు కొన్ని క్షణాల తరువాత తెరచిన అతని కళ్లల్లో పేరుకున్న రక్తాన్ని ఆ మసక వెలుతురులో కూడా స్పష్టంగా చూడగలిగాను నా చూపుల నుంచి తప్పించుకుంటూ అన్నాడు శాంతమూర్తి-

"...ఆ భవనంలోంచి, నేనిలా అడుగు ఇవతల పెట్టాను అంతే !. మరుక్షణం మరో బీభత్సం. ! అప్పుడే పడిన మరో పిడుగుపాటుకు ఈ భవంతి ఈ 'ప్రతిమా నిలయం' నాశనమయిపోయింది సారథి అదృష్టవంతుడు అతను కూడా ప్రతిమను ఆరాధించే వుంటాడు బహుశా నా కంటే ఎక్కువగా ! అందుకే ఆమెను చేరుకునే అదృష్టం అతనికి కలిగితే ఆమె జ్ఞాపకాల్ని అనుక్షణం గుర్తుచేసుకునే దురదృష్టం ఏమో అదీ అదృష్టమేనేమో నాకు మిగిలింది" శాంతమూర్తి మాటలు ఆవేశంగా వున్నాయి.

అంతలోనే కళ్లుపొడుస్తూ ఆకాశం తళుక్కున మెరిసింది

ఆ వెలుగులో ప్రతిమానిలయం తాలూకు శిథిలావశేషాలు నా చుట్టూ కనిపించాయి.

ఆ శిథిలాలలోంచి ఏవో పిలుపులు దీనంగా వినిపించినట్టనిపించింది.. నా గుండె ఝల్లుమంది.

కెవ్వుమన్న నా కేక ఉరిమిన భయంకరమైన ఉరుము ధ్వనిలో కలసిపోయింది .